క్లుప్తంగా

రేపటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

పామర్రు: సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పామర్రు ఇన్‌చార్జి తహసీల్దార్ నాగభూషణం మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆధార్‌కు మొబైల్, ఈ మెయిల్ ఐడీ లింక్, బయోమెట్రిక్, పేరు మార్పు, డీఓబీ మార్పు, జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, చిరునామా మార్పు, కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ డౌన్‌లోడ్ తదితర సేవలను అందిస్తామన్నారు. బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100, మిగతా సేవలకు రూ.50 ఛార్జి తీసుకుంటామన్నారు. ఆధార్ సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఏసీఎస్ అధ్యక్షుల పదవీ కాలం పొడిగింపు

పామర్రు: మండల పరిధిలోని 11 పీఏసీఎస్ అధ్యక్షుల పదవీ కాలం ఆరునెలల పాటు పొడిగిస్తూ గుడివాడ సహకార శాఖ డెప్యూటీ డైరెక్టర్ డి.విజయలక్ష్మి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పామర్రు, ఉండ్రపూడి, నిమ్మకూరు, నిమ్మలూరు, కొమరవోలు, పెదమద్దాలి, ఐనంపూడి, ఎలకుర్రు, జుఝువరం, కనుమూరు, జమీగొల్వేపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు బొమ్మారెడ్డి నారాయణ రెడ్డి, మురారి వెంకట కుమారి, చిగురుపాటి ప్రవీణ్, ఆత్మూరి నాంచారయ్య, శింగవరపు రామచంద్రరావు, సుంకర శిరీష, బలుసు హరికిరణ్, కాశీనాధుని నాగేశ్వరరావు, కొలుసు కోటేశ్వరరావు, మత్తి వెంకట రమణ, కనుమూరు ధనలక్ష్మిలు ఆదేశాలు అందుకున్నారు. వీరిని ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు అభినందించారు.

ఆటపాకలో ఉచిత వైద్య శిబిరం

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆటపాక సచివాలయం వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కొల్లేటికోట పీహెచ్‌సీ డాక్టర్లు బి.శంకర్, ఎస్.కిరణ్‌కుమార్ ఎయిడ్స్, టీబీ వ్యాధి సోకకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో స్కీమ్ సూపర్‌వైజర్ పి.వెంకటేశ్వరరావు, లింక్ వర్కర్ పి.సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



మండవల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.మల్లీశ్వరి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయ్యవారి రుద్రవరం-2, లోకుమూడి-2, పుట్లచెరువు-1, పెరికెగూడెం-1, సింగనపూడి-1 వలంటీర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేపట్టారు. రెండు రోజుల్లో అర్హులైన వారిని వలంటీర్లగా నియమిస్తామని ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ ఎ.జనార్దనరావు, ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యవారి రుద్రవరంలో కళాజాతా



మండవల్లి: కేడీసీసీ బ్యాంక్ పర్యవేక్షణలో మేనేజర్ రాజులపాటి సత్యనారాయణ, సూపర్‌వైజర్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో అయ్యవారి రుద్రవరంలో కళాభారతి బిళ్లపాడు బృంద కళాకారులు మంగళవారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రైతులకు అందిస్తున్న వ్యవసాయ రుణాలు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, పీఎం సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు, వివిధ రంగాల వారికి అందిస్తున్న రుణ సౌకర్యాలు తదితర విషయాలపై కళాకారులు పాటల ద్వారా, వీధి నాటికల ద్వారా అవగాహన కల్పించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ల, సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్ వితరణ

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి సహాయ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రూ.13 వేల విలువ చేసి 250 కిలోల బియ్యాన్ని కళాశాల అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవికి అందజేశారు. జయలక్ష్మీ రైస్‌మిల్లు అధినేత, సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి వరప్రసాద్ ఈ సాయాన్ని అందించారని ఫౌండేషన్ అధ్యక్షులు ఉస్మాన్ బాషా తెలిపారు. కార్యక్రమంలో రౌతుల ప్రసాద్, కళాశాల అధ్యాపకుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే డీఎన్నార్



పెయ్యేరులో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ప్రజాప్రతినిధులు

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తూ పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెయ్యేరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేయడంతో పాటు పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రధానంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయించి వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేసి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని పేదలకు పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నందున వారంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. దీనిని చూసి ఓర్వలేని టీడీపీ అధినేత చంద్రబాబు, ఇతర ప్రతిపక్ష నేతలు దిగజారుడు విమర్శలకు దిగుతున్నారన్నారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, పథకాలు కొనసాగేందుకు జగన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

నియోజకవర్గంలో ఎంతో కాలంగా తిష్ట వేసిన సమస్యలకు తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 13 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ప్రత్యేకించి ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీటీసీ సభ్యుడు కోటి ప్రవీణ్, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, కో ఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, శీలం రామకృష్ణ, జాస్తి రాజేంద్రప్రసాద్, ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, సోమా సత్యనారాయణ, దివి సతీష్, సాక్షి సాయిబాబు, వీరమల్లు కొండలరావు, బోయిన రామరాజు, శౌంఠి నాగరాజు, బేతపూడి వెంకటరమణ, గంటా కోటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- బొడ్డపాడులో ఉత్సాహంగా గడప గడపకు మనప్రభుత్వం

తోట్లవల్లూరు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించటంతో పాటు బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సంచార పశు వైద్య సేవ వాహనాన్ని ఎమ్మెల్యే కైలే ప్రారంభించారు. ఎరువులు, రుణాలు సక్రమంగా అందించటం లేదనే ఫిర్యాదుపై పీఏసీఎస్ కార్యదర్శిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా..

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేయటం కోసం వేల కోట్లు వెచ్చించి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటంతో పాటు ఊళ్ల తరహాలో జగనన్న కాలనీలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం తనవంతు ఆర్థిక సహకారం అందించటంతో పాటు సిమెంటు, ఇనుము, ఇసుకను కూడా అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగనన్నకు అన్ని వర్గాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్‌లు మూడే శివశంకరరావు, ఆరేపల్లి శివరామకృష్ణ, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, ఎంపీటీసీ దారం రోజారాణి, ఆరేపల్లి జగన్‌మోహన్‌రావు, నాయకులు నడకుదురు రాజేంద్ర, సన్నాల నాగేంద్రబాబు, గోపిశెట్టి ఫణికుమార్, దారం నాగగోపి, డొక్కు శ్రీనివాసరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బొడ్డపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బొడ్డపాడులో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే

మొవ్వ: వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ తెలిపారు. పశువైద్యా సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవాకు సంబంధించి మొవ్వ మండలానికి కేటాయించిన రెండో వాహనాన్ని ఎమ్మెల్యే కైలే మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని బొడ్డుపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ వాహనాన్ని ప్రారంభించారు. అలాగే పశువైద్య సేవలు పొందేందుకు 1962 కాల్ చేస్తే పాడిపోషకుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మొవ్వ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఎస్ఏ దివాకర్, డాక్టర్లు సృజన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

17లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలి



పామర్రు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి చేయాలని పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని 25 గ్రామాల్లో 16,764 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 47 శాతం మందికి రేషన్ అందించామని చెప్పారు. ఇచ్చిన గడువు లోపుగా మిగిలిన వారికి కూడా రేషన్ పంపిణీని పూర్తి చేయాలన్నారు. నూరు శాతం రేషన్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని అందిస్తోందని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఆర్వో సిరాజుద్దీన్, రెవెన్యూ సిబ్బంది, మొబైల్ వాహన నిర్వాహకులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



కైకలూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఆలయ కమిటీ సభ్యులు

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింటమ్మ జాతర, గోకర్ణేశ్వరస్వామి శివరాత్రి మహోత్సవ వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆయన నివాసం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. జాతరను దిగ్విజయంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి మార్చి 7వ తేదీ వరకు అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వర స్వామి వార్ల కల్యాణం మార్చి 3న నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గోకర్ణేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ చింత సాయిబాబు, ధర్మకర్తలు ఊడిమూడి సుబ్బరాజు, మద్దాల సుబ్బలక్ష్మి, ఇంటి ఇందిరమ్మ, బలే సారంగధర, అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శేఖర్‌సింగ్

గుడివాడటౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని తమ బాధ్యతగా భావించి పూర్వ విద్యార్థులు సాయం అందించాలని గుడివాడ ఎంఈఓ శేఖర్‌సింగ్ కోరారు. స్థానిక కాకర్ల వీధిలోని నంబర్-2 మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నందు ఎన్నారై గోరంట్ల వాసుబాబు వితరణతో ఏర్పాటు చేసిన రూ.20 వేలు విలువైన బోధనాభ్యసన పరికరాలు(టీఎల్ఎం) సామగ్రిని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో బాపట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడిన వాసుబాబు తన తల్లిదండ్రులు గోరంట్ల దాసయ్య- శేషారత్నం జ్ఞాపకార్థం చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 210 పాఠశాలలకు డిజిటల్ లైబ్రరీ, టీఎల్ఎం సామగ్రికి రూ.1 కోటి ఖర్చు చేయడం పూర్వ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ఉన్న శ్రద్ధకు నిదర్శనమని చెప్పారు. ఉన్నత స్థితికి చేరుకున్న ప్రతి విద్యార్థి వాసుబాబును ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ, నాయకులు అల్లం రామ్మోహనరావు, హెచ్ఎం తూములూరి నాగమణి, సీఆర్పీ లక్ష్మీ ప్రసన్న, సచివాలయ ఉద్యోగులు బి.మహేష్, జి.బాలశివాజీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎండీ షబీనా, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీపార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన అవసరం

చిలకలపూడి(మచిలీపట్నం): బడ్జెట్‌లోని అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మారుతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల బడ్జెట్ ప్రాధాన్యతను వివరించారు. వైస్ చాన్స్‌లర్ కె. రామ్మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వీటితో పాటు జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు, శిక్షణా సంస్థలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెరిగాయని, అనేక వస్తువులు సొంతంగా తయారు చేసుకునే అవకాశాన్ని కల్పించారని చెప్పారు. అట్టడుగువర్గాల వారికి మేలు చేసేలా ఈ బడ్జెట్ రూపొందించబడిందన్నారు. ఆడిటర్ కె. శివరామకుమార్ మాట్లాడుతూ ఆదాయ పన్ను, బడ్జెట్‌లో కేటాయింపుల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న భూ రక్ష పథకం రైతులకు వరం



జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం రైతులకు వరమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కై కలూరు భాష్యం స్కూల్ సమీపంలో డ్రోన్ సర్వే పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వందేళ్ల తర్వాత దేశంలో మొదటి పర్యాయం ఆంధ్రప్రదేశ్‌లో సర్వే పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే పనులను సిబ్బంది చేపడుతున్నారన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, తహసీల్దార్ బి.మురళీకృష్ణ, సీఐ ఎంవీఎస్.నాగరాజు, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ ఫణి పాల్గొన్నారు. అనంతరం ఏలూరు రోడ్డులోని జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణ పనులను ఎమ్మెల్యే డీఎన్నార్ పరిశీలించారు. లబ్ధిదారులను త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో మౌలిక సదుపాయాలైన విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర సౌకర్యాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు చరిత్ర అందరికీ తెలియాలి



అల్లూరి మనవడు శ్రీరామరాజును సన్మానిస్తున్న నాయకులు

కైకలూరు: భవిష్యత్ తరాలకు స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చరిత్ర పాఠ్యపుస్తకాల ద్వారా అందరికీ తెలియజేయాలని ఆయన మనవడు(అల్లూరి తమ్ముడు సత్యనారాయణరాజు మనవడు) అల్లూరి శ్రీరామరాజు చెప్పారు. కైకలూరులో కూచిపూడి నాట్యరవళి నిర్వాహకురాలు శ్రీవల్లి ఆహ్వానం మేరకు ఆయన మంగళవారం కైకలూరు నాట్యరవళి శిక్షణాలయానికి వచ్చారు. మనవడు శ్రీరామరాజు మాట్లాడుతూ.. సీతారామరాజు కేవలం విప్లవవీరుడే కాదని, ఆయుర్వేదం ద్వారా అనేక మందికి గిరిజనులకు స్వస్థత చేకూర్చారన్నారు. ఆయనకు 5 భాషాల్లో ప్రావీణ్యం ఉండేదన్నారు. ప్రభుత్వాలు ఆయన సేవలకు గుర్తింపు ఇవ్వడం సంతోషమని చెప్పారు. క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామరాజును సన్మానించారు.

నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అద్దంకి వెంకట శ్రీనివాసరావు(సేన శ్రీను) ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులు ఆయన సత్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను గడగడలాడించి, గిరిజన ప్రజల కోసం అసువులు బాసిన అల్లూరి విగ్రహాన్ని ప్రధాని భీమవరంలో ఆవిష్కరించడం గొప్ప పరిణామమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు, మాజీ అధ్యక్షుడు వెంకటపతిరాజు, ట్రెజరర్ దండు ప్రసాదరాజు, ఈసీ సభ్యులు ములకపాటి దుర్గరాజు, పొత్తూరి వెంకట నరసింహరాజు, ప్రముఖులు పెన్మత్స త్రినాథరాజు, గంటా సత్యనారాయణ, పేరిచర్ల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సంపద కేంద్రాలు

గుడివాడటౌన్: గత ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులకు జేబులు నింపే ఉద్దేశంతో నిర్మించిన సంపద కేంద్రాలు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తెస్తోంది. చెత్త నుంచి సంపద సృష్టించాలంటూ గత ప్రభుత్వం ఉపాధి హామీ పనుల్లో భాగంగా హడావిడిగా ప్రతి గ్రామంలోనూ షెడ్లను నిర్మించారు. వాటిలో వర్మి కంపోస్ట్ తయారు చేసేందుకు అనువుగా తొట్టెలు నిర్మించారు.

అనంతరం ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లుగా వ్యవహరించిన టీడీపీ నాయకులు బిల్లులు తీసుకుని తప్పుకుంటే అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం వాటిని గాలికి వదిలేశారు. షెడ్లు ఊరికి శివారులో ఉండటం, కాపలా ఉండేవారు లేకపోవడంతో అవి పబ్లిక్ బార్‌లుగా తయారయ్యాయి. నిత్యం మందుబాబుల హడావిడితో ఈ షెడ్లు నిండిపోయేవి. కొన్ని చోట్ల అసాంఘిక కార్యక్రమాలకు సైతం నిలయంగా మారాయి. ప్రజాధనం వృథా అయ్యింది.



వర్మి కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న అధికారులు



షెడ్లలో మద్యం సేవిస్తున్న మందుబాబులు(ఫైల్)

వాడుకలోకి తీసుకువచ్చాం..



ప్రభుత్వ ఆదేశాలతో సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకువచ్చాం. వర్మి కంపోస్ట్ తయారు చేసి పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో చేపల చెరువులు అధికంగా ఉండటంతో కార్మికుల కొరత ఉంది. ప్రభుత్వం వేతనాలు పెంచడం ద్వారా కార్మికుల కొరతను అధిగమించవచ్చు.

– సరెళ్ల రత్నకుమారి, నందివాడ సర్పంచ్.

వర్మి కంపోస్ట్ ఉత్పత్తి..

నేడు జగనన్న స్వచ్ఛసంకల్పం అమలులో భాగంగా ప్రతి మండలంలోనూ కొన్ని సంపద కేంద్రాలను తిరిగి వినియోగంలోకి తెస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో షెడ్లలోని తొట్లెల్లో ఎర్రలు వేసి ఎరువును తీస్తుంటే కొన్ని గ్రామాల్లో షెడ్లను వినియోగంలోకి తెచ్చి సేకరించిన చెత్తను క్రమపద్ధతిలో కుండీలకు ఎత్తే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలో అన్ని సంపద కేంద్రాల్లో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఎర్రలు వేసి వర్మి కంపోస్ట్ ఉత్పత్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. తద్వారా గ్రామానికి ఆదాయం తేవడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి కూడా అనుకూలంగా ఉంటాయని చెప్పారు. దీని వల్ల ప్రభుత్వ ఆశయం నెరవేరటంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత పాటించటం వర్మీ కంపోస్టు తయారీ ద్వారా గ్రామానికి ఆదాయం వస్తుందని గ్రామ సర్పంచ్‌లు అంటున్నారు